# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 26 ఆగస్టు , 2026 | పేజీలు :6




విదేశీ పర్యటన విజయవం తంగా ముగించుకుని హైద రాబాద్‌కు తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.
-ప్రజాపక్షం / నకిరేకల్

# మిర్యాలగూడ సమగ్రాభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నిలిపి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడమే తమ ముఖ్య లక్ష్యమని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కమిషనర్ శ్రీజారెడ్డిల సమక్షంలో కౌన్సిలర్లతో నిర్వహించిన మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి సంబంధించి కౌన్సిలర్లు లేవనెత్తిన పలు అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి విస్తృతంగా చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ తదితర అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు నిరంతరం సమన్వయం పాటిస్తూ పనిచేయాలని పేర్కొన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించడమే కాకుండా, పట్టణ ప్రజల అభిప్రాయాలు, సలహాలను స్వీకరిస్తూ మిర్యాలగూడను జిల్లాలోనే ఆదర్శకరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు : ఎమ్మెల్యే

పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించినా సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్‌లో విద్యార్థులతో యాజమాన్యం పనులు చేయిస్తోందంటూ పలు విద్యార్థి సంఘాల నుంచి ఫిర్యాదులు అందడంతో మోడల్ స్కూల్‌తో పాటు పలు గురుకుల పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్, పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలపై యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనను ఉపేక్షించబోమని తెలిపారు.

# మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారులు సుధాకర్ రెడ్డి ,ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ ధనావత్ శంకర్ నాయక్ ,సర్పంచులు డొంకేన రేణుక వెంకటేష్ యాదవ్,చాడ భాస్కర్ రెడ్డి, బొత్త రాములు, భూక్య రాజారాం నాయక్, కరుణాకర్ పాల్గొన్నారు.





విద్యార్థుల్లో కనీస విద్యా సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కంచనపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు తెలుగు, ఇంగ్లీష్‌లో పదాలకు అర్థాలు తెలిసే విధంగా నేర్పించాలన్నారు.

# అర్హులందరికీ పథకాలు

## ప్రతి పేద కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ప్రజా ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రేషన్ కార్డు ద్వారా అందే ప్రయోజనాలకు పరిమితులు ఉండగా, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.అర్హత కలిగిన ఏ కుటుంబం కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.కార్యక్రమంలో జెడ్‌పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,డీసీసీబీ వైస్ ఛైర్మన్,తహసీల్దార్ టి.వేణుగోపాలరావు,డీఎస్‌ఓ వెంకటయ్య,ఎంపీడీవో కె.ఉమేష్,సీఐ సిరికొండ సురేష్, ఎస్ఐ పి.విష్ణు, బత్తుల ఊశయ్య గౌడ్, సర్పంచ్ జెరిపోతుల భరత్ గౌడ్, గాయం శ్యాంసుందర్ రెడ్డి, ఎస్.సత్తయ్య,వడ్డే భూపాల్ రెడ్డి,నేతగాని కృష్ణయ్య,యుగంధర్ రెడ్డి,గడ్డం పశుపతి,కందకట్ల రజిని పాల్గొన్నారు.





## ప్రత్యామ్నాయ పంటల వైపే మొగ్గు చూపాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల భూగర్భజలాలు దారుణంగా పడిపోతున్నాయని, అందుకే రైతులు వరి నాట్లకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎం.రుషేంద్రమణి పిలుపునిచ్చారు. ఉట్లపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నీటి లభ్యత, ఎల్‌నినో ప్రభావంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూగర్భజలాలు క్రమంగా తగ్గుతున్న తరుణంలో రైతులు సాంప్రదాయ వరి సాగును పక్కనబెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా బిందు, తుంపర సేద్యం పద్ధతుల ద్వారా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్లపల్లి ఏఈఓ గోపి, రైతులు నాగరాజు, ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అనారోగ్యంతో బాధపడుతున్న జిల్లా కేంద్రానికి చెందిన కొండూరు రవి పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం మంగళవారం సూర్యాపేట ఆర్యవైశ్య మిత్రుల ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్య విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రతి ఆర్యవైశ్యుడు సహకరించాలని కోరారు. ప్రతిభ గల విద్యార్థుల చదువులకు పేదరికం అడ్డుకావద్దన్నారు.ఈ కార్యక్రమంలో పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్పీ గాంధీ, చల్లా సత్యనారాయణ, కలకోట లక్ష్మయ్య, వెంపటి శబరినాథ్, ఉప్పలంచు కృష్ణ, బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

## ధర్నా విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నాగార్జునసాగర్ ఎడమకాలువకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేరేడుచర్ల పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి బిఆర్ఎస్ మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దొండపాటి అప్పిరెడ్డి, ఎస్‌కె షాహిన్ హుస్సేన్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ కడియం వెంకటరెడ్డి, మాజీ ఎంపిపి చెన్నబోయిన సైదులు, వస్కుల సుదర్శన్, చిట్యాల శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.




# నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలి



**ప్రజాపక్షం/కోదాడ (మోతె) :** నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మోతె మండలంలోని రాంపురంతండలోని దొరబండ పైన వన మహోత్సవంలో భాగంగా జిల్లా ఎస్‌పి కె. నరసింహతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తప్పకుండ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షణ చేయాలని కోరారు. జిల్లాలో ఒక్క రోజులో సుమారు రెండు లక్షల మొక్కలకు పైగా నాటడం జరుగుతుందని చెప్పారు. అనంతరం మామిళ్ళగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల నిర్వహణ, వసతులు, పిల్లల హాజరు వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులుని అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో మాట్లాడుతూ భోజనం సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం, ప్రతి ఒక్కరికి దుస్తులు అందాయా లేదా అంటూ విద్యార్థులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, ఆర్‌డిఓ మోహన్ రావు, మండల ప్రత్యేక అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి, సిఐ రామకృష్ణ రెడ్డి, తహశీల్దార్ యం. వెంకన్న, ఎంపిడిఓ సందీప్ కుమార్, ఎస్ఐ బి. లచ్చిరెడ్డి, సర్పంచ్ సత్యమ్మ శ్రీను, ఉపసర్పంచ్ శైలజ మోహన్, ఏపిఎం మంజుల, ఏపిఓ నగేష్, పాల్గొన్నారు.

# బిసిల ఐక్యతతోనే హక్కుల సాధన




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీలు ఐక్యమై ఉద్యమించడం ద్వారానే తమ హక్కులను, రిజర్వేషన్లను సాధించుకోవడం సాధ్యమవుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతిని మిర్యాలగూడ బీసీ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఎంతగానో తాపత్రయపడి తన ముఖ్యమంత్రి పదవికి కూడా రాజీనామా చేసిన చరిత్ర మండల్‌కు ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణనలోనే కులగణన చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాజకీయ రిజర్వేషన్లు సాధించకపోతే బీసీలు మరో 10 సంవత్సరాల పాటు వెనుకబాటుతనానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ జాడీ రాజు, మిర్యాలగూడ జేఏసీ కో కన్వీనర్ చెగొండి మురళి, తెలంగాణ జన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయి నాగేశ్వరరావు యాదవ్, బీసీ నాయకుడు కోల సైదులు, రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు మహేష్ గౌడ్, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు ఎల్లయ్య, భీమరపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# సాగర్ జలాలు విడుదల చేయాలి

**ప్రజాపక్షం/కోదాడ:** నియోజకవర్గ రైతులకు వెంటనే సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కోదాడ పట్టణంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు అందించడంలో విఫలమైన నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు విడుదల చేయకుండా నల్లగొండ జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జూన్‌లో సాగర్ నుంచి విడుదల చేసిన నీటిని ఖమ్మం జిల్లాకు తరలించారని, నల్లగొండ జిల్లా ఆయకట్టుకు న్యాయం చేయలేదని విమర్శించారు. మరో



వైపు పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలిస్తున్నా ప్రభుత్వం స్పందించకుండా మౌనం వహిస్తోందని ఆరోపించారు. నల్లగొండ జిల్లా రైతాంగానికి క్షమాపణ చెప్పడంతో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన నిర్వహిస్తున్న శాఖలో అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని గవర్నర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభ్యుదయ ఆలోచనలను అణిచివేయాలని పాలకుల యత్నం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, అభ్యుదయ ఆలోచనలను నిర్బంధంగా నిరాకరించేందుకు, అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వాలకు జెన్‌జీ, జైన్ అల్ఫా లాంటి కొత్త తరాలు తమ సరికొత్త తరహా ఉద్యమాలతో సవాలు విసురుతున్నాయని ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు అందె సత్యం అన్నారు. హుజూర్‌నగర్‌లోని స్పందన సామాజిక అధ్యయన వేదిక నిర్వాహకులుగా ఉండి జిల్లా ఫార్మసి ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కాకి పరాబ్‌కుమార్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగన్న మాట్లాడుతూ సమాజం మానవీయంగా పురోగమించడానికి ప్రేమ ఒక ప్రేరణగా, ప్రశ్న ఒక సాధనంగా నిలిచాయని, వాటిని కాపాడుకోవడం మనముందున్న కర్తవ్యం అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ మోడల్‌రోడ్, టౌన్‌హల్ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలలో అందరిని కలుపుకుని ముందుకెళ్లడంతో స్పందన సంస్థ విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాముల శివారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరుమల్లిఖార్జున్‌రావు, పల్లె వెంకటరెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, మేకల నాగేశ్వరరావు, కంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన సమాజం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో పరిసరాల పరిశుభ్రతను కాపాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మిర్యాలగూడ డివిజన్ అటవీ శాఖ, మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నాటిన మొక్కల కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి మాట్లాడారు. నానాటికీ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి చెట్లను పెంచడం ఒక్కటే సరైన మార్గమని చెప్పారు. పెరుగుతున్న పట్టణీకరణ వల్ల రాబోయే తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శివారు, విలీన గ్రామాల అభివృద్ధిపై దృష్టి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి దశాలవారీగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 14వ వార్డు స్నేహనగర్‌లో పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షం నీరు ఖాళీ స్థలాల్లో నిల్చి ఉండడం వల్ల దోమలు వస్తుండడంతో పిల్లలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు.ఖాళీ స్థలం యజమానులకు సమాచారం ఇచ్చి నీళ్లు నిలువ ఉండకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## చేతివృత్తిదారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని ఆర్‌అండ్‌బి డిఈ కార్యాలయం ముందు నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానికంగా 30, 40 సంవత్సరాలుగా ఉంటూ చిన్న చిన్న కులవృత్తులు, చేతివృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి తొలి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ బిజేపి పట్టణ అధ్యక్షులు కొండ హరిష్ గౌడ్, పలువురు చేతివృత్తిదారులతో కలిసి అర్‌అండ్‌బి డిఈఈ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 40 సంవత్సరాలుగా స్థానికంగా జీవిస్తూ తరతరాలుగా చిన్న చిన్న కులవృత్తులు చేతి పనులు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న అనేక మంది ప్రస్తుత జీవనోపాది కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చేతివృత్తిదారులకు, చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్‌లో మొదటి ప్రాధాన్యత ఇస్తూ షాపులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి చంద్రయ్య, మేళ్లచెరువు లక్ష్మణ్, చుక్క హరిష్, సతిబల్వంత్ సింగ్, బాధితులు మంగమ్మ, నాగమణి, మంగమ్మ, మేరి, ఈశ్వరమ్మ, లింగయ్య పాల్గొన్నారు.



## ప్రాథమిక పాఠశాల సందర్శన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండలంలోని మాచవరం ప్రాథమిక పాఠశాలను హుజూర్‌నగర్ ఎపిఎం అనురాధ సందర్శించారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన యూనిఫామ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిఫామ్‌ల విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్‌లతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ నర్సింహరావు, వీరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గిరిజన సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొర్ర రాంసింగ్



**ప్రజాపక్షం/దేవరకొండ;** మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గిరిజన సర్పంచ్ సంఘం రాష్ట్ర ఆవిర్భావ సదస్సులో దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ కొర్ర రాంసింగ్‌నాయక్‌ని రాష్ట్ర అధ్యక్షులు భూక్య సంతోష్‌నాయక్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమించారు.అనంతరం కొర్ర రాంసింగ్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్లో బంజారా సామాజిక వర్గానికి చెందిన సీనియర్ శాసన సభ్యుల్లో ఒకరికి క్యాబినెట్ మినిస్టర్‌గా అవకాశం కల్పించాలని అన్నారు. గిరిజన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని రూ.30వేలకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## సూర్యాపేటకి బుల్లెట్ ట్రైన్ రాకుండా అడ్డుకునేది రాష్ట్ర ప్రభుత్వమే

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** సూర్యాపేటకి బుల్లెట్ ట్రైన్ రాకుండా అడ్డుకున్నది రాష్ట్ర ప్రభుత్వమేనని గ్రామ సర్పంచ్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రానికి మూడు బుల్లెట్ ట్రైన్ కేటాయించి తెలంగాణని వాణిజ్యపరంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్రం ఆలోచించిందని రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై మొదటి రెండవ అలైన్మెంట్లను పక్కన పెట్టి ప్రభుత్వం కెబినెట్‌లో తీర్మానం చేసి మూడవ అలైన్మెంట్‌ను సిద్ధం చేసిందన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాయణదాసు నాగరాజు, నాయకులు ఉప్పల లింగయ్య, కొండ రవి, ఉప్పల వెంకన్న, పోడేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

## శాంతియుత నిరసన

**ప్రజాపక్షం/రామన్నపేట :** జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపుమేరకు రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఇటీవల జరిగిన ఢిల్లీ నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం పైలట్ గనులను విద్యార్థులపై ఉపయోగించినందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లేదా కేంద్ర ప్రభుత్వం వెంటనే అమిత్షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్, రుద్రాల విక్కీ సాయి,సుర్వి సతీష్,చిరబోయిన నవీన్,కామిటికారి సాయివెంకట్,సుర్వి నవీన్, లెంకల ఉమేష్,వేణు,సుర్వి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల జీఎల్ గార్డెన్‌లో జిల్లా గౌడ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నకరికంటి కాశయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శిగా పుల్లెంల శ్రీనివాస్ గౌడ్,గౌరవ అధ్యక్షుడిగా పొన్నం లక్ష్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు,కమిటీ సభ్యులు గౌడ సంఘ అభివృద్ధికి కృషిచేసి సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రవి గౌడ్,జిల్లాలోని వివిధ మండలాల కార్యవర్గ సభ్యులు,గౌడ సంఘం నాయకులు,పుల్లెంల అచ్చాలు గౌడ్ వడ్డే పల్లి గోపాల్ గౌడ్, ఆకునూరి నారాయణ గౌడ్,కొన్నే శంకర్ గౌడ్, సైదులు గౌడ్,జేరి పోతుల శంకర్ గౌడ్,ఇతగోని వేంకటేశ్వర్లు, సుర్గి యాదగిరి,కొప్పు కృష్ణ ,వేముల నర్సింహ,సత్తయ్య,ఎం.సైదులు,జి. కృష్ణ,లాలయ్య, బండారి గోవర్దన్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

# రోడ్డు మధ్యలో అక్రమ నిర్మాణం.. ప్రమాదాలకు ఆహ్వానం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో చేపట్టిన అక్రమ నిర్మాణం వాహనదారులు,పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డు మధ్యలో నిర్మాణం ఉండటంతో రహదారి ఇరుకుగా మారి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో వివేకానంద విగ్రహం సమీపంలోని రాఘవేంద్ర కాలనీ ముఖద్వారం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని కోరుతూ కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ రహదారి మీదుగా హనుమాన్‌నగర్, న్యూ రాఘవేంద్ర కాలనీ,పద్మానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు.అదేవిధంగా ఈ ప్రాంతంలో ఉన్న రెండు పాఠశాలలకు విద్యార్థులు ఇదే మార్గం గుండా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మధ్యలో నిర్మాణం ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు.

అధికారుల స్పందన కరువు

ప్రజలకు,విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న నిర్మాణంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్,ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతున్నారు.అనంతరం రహదారి మధ్యలో నిబంధనల ప్రకారం డివైడర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, పాదచారులు , విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హత్యకు గురైన దంపతుల కుటుంబానికి ప్రభుత్వ అండ



**ప్రజాపక్షం/కోదాడ (మోతె) :** మోతె మండలం బీక్యా తండకు చెందిన భార్యాభర్తలు నాగులు, బూబా ఇటీవల దారుణ హత్యకు గురైన సందర్భంగా దంపతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహ భరోసా కల్పించారు. మంగళవారం వారు స్వయం గా బీక్యా తండలోని బాధిత దంపతుల నివాసానికి వెళ్లి వారి కుమార్తెలు జ్యోతి, సంధ్యలను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వపరంగా అట్రాసిటి కేసు కింద రావాల్సిన ఆర్థిక సహాయంలో మొదటి విడతగా 50శాతం రూ.4.2 లక్షల నగదును బాధితుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపి, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ఘోరమైన సంఘటన జరగడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడానికి, జిల్లా యంత్రాంగం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడానికే తాము ఇక్కడికి వచ్చామన్నారు. ఈ కేసులో పోలీసులు ప్రతి చిన్న ఆధారాన్ని అత్యంత నిశితంగా సేకరిస్తున్నారని, చార్జ్‌షీట్‌ను త్వరగా సిద్ధం చేసి కోర్టుకు పంపుతామని చెప్పారు. నేరస్థులకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పిలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డిఓ వేణుమాధవ్, స్థానిక తహశీల్దార్ వెంకన్న, సిఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏర్పాట్లు చేయాలి

**ప్రజాపక్షం/భువనగిరి :**30వ తేదీ ఆదివారం రోజున జరిగే భోనాల ఉత్సవాలకు సంబంధించి లైట్లు, సౌండ్ సిస్టం, ఇతర ఏర్పాట్లు చేయాలని 22, 23వ వార్డు కౌన్సిలర్లు మునిసిపల్ కమిషనరుకి వినతి పత్రం అందజేశారు. 2వ వార్డులోని నల్ల పోచమ్మ గుడి, ఎల్లమ్మ గుడి, మైసమ్మ గుడి అలాగే 23వ వార్డులోని కోట మైసమ్మ గుడి, మమ్మాయమ్మ గుడి, మారెమ్మ గుడి, పోత లింగాల గుడితో పాటు ఎల్బీ నగర్లోని పోచమ్మ దేవాలయాల వద్ద పారిశుద్ధ్యంతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఘనంగా ఏర్పాట్లు చేయాలనీ కోరడం జరిగింది.




## ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/డిండి;** సెప్టెంబర్ 8,9,10వ తేదిలలో జరిగే తెలంగాణ రాష్ట్ర అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డిండి మండల సిపిఐ ప్రజా భవన్‌లో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్, ఎలిమినేటి నరేష్ చేతుల మీదుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్, కరపత్రాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 8,9,10వ తేదిల్లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మండలంలోని యువకులంతా ఈ మహాసభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఈ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. డిండి మండల అభివృద్ధి కోసం నిత్యం పోరాటం చేస్తామని యువత మాతో కలిసి పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల ఉపాధ్యక్షులు భూపాల్, రాజు, అర్జున్, నవాజ్, సురేష్, స్టివెన్ తదితరులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట ప్రజల ఆశాకిరణం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కేంద్రం ప్రకటించిన శంషాబాద్ నుండి వయా సూర్యాపేట జాతీయ రహదారి 65 మీదుగా బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట ప్రజలకు ఆశాకిరణమని దానిని అడ్డుకుంటే ఎంతటి వారైనా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జుట్టుకొండ సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ వై. వెంకటేశ్వర్లు అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటి ఆధ్వర్యంలో చేపట్టిన 12వ రోజు మంగళవారం దీక్షలో డివైఎఫ్ఐ సభ్యులు పాల్గొనగా దీక్షలు ప్రారంభించి మాట్లాడారు. ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ పక్కదారి పట్టిస్తే జాతీయ రహదారి 65 వెంట ఉన్న ప్రజల ఆగ్రహ జ్వాలల్లో కొట్టుకుపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షలో నాయకులు బోయిళ్ళ నవీన్, సానబోయిన ఉపేందర్, జిల్లెపల్లి నరసింహారావు, షేక్ జహంగీర్, ఉత్తేజ్, భద్రయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొనగా వారికి అఖిలపక్ష నాయకులు పెద్దిరెడ్డి రాజా, రమణాచారి, చలమల్ల నరసింహ, జీడి బిక్షం, కొత్తపల్లి శివకుమార్, కర్నాటి కిషన్ సంఘీభావం తెలిపారు.

## విద్యార్థులపై కాల్పుల ఘటనను ఖండిస్తూ యువజన కాంగ్రెస్ నిరసన

**ప్రజాపక్షం/భువనగిరి :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై కాల్పులు జరిపిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, లేదా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆయనను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎండి అవేస్ చిస్తి, మాజీ మునిసిపల్ చైర్మన్లు, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, మంగ ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కానుకుంట్ల రేఖ బాబురావు, కౌన్సిలర్ జాలిగం విగ్నేష్, కాంగ్రెస్ SC సెల్ జిల్లా చైర్మన్ కాకునూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట జి.ఆర్.ఎమ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు కాలేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. రామన్నపేట పట్టణంలో అర్హులకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## ఉచిత నోటు పుస్తకాల పంపిణీ



ప్రజాపక్షం/రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ప్రభుత్వంచే రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోఉచితనోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్ విద్యాధికారి సురేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి, కళాశాలలను బలోపేతం చేయడం కోసం నిధులను ఇవ్వడంతో పాటు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు మరియు ఇంటర్మీడియట్ స్థాయిలో ఉచిత విద్యను అందిస్తున్నది. ఈ కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపల్ జగదీష్, జానయ్య లైబ్రేరియన్ అధ్యా పకులు ప్రసన్న దేవి, పున్నారావు, మాల వెంకట రెడ్డి, ముందడి వెంకటరెడ్డి, కిరణ్ నిర్మల, కవిత, నరసింహా రావు, రాజేశ్వరి, అశోక్ కుమార్, శ్రీకాంత్, నగేష్, అశోక్ రెడ్డి, ఉపేందర్ రావు, కరుణ, ఉమారాణి, పరశురాం,శ్రావణ్ కుమార్పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతో భూసారం మెరుగు

ప్రజాపక్షం/వేములపల్లి: సేంద్రియ వ్యవసాయంతో భూసారం మెరుగుపడుతుందని మిర్యాలగూడ సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి,ఏఆర్ఎస్ కంపసాగరం శాస్త్రవేత్త అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం వల్ల భూమికి మేలు జరుగుతుందన్నారు. వనమహోత్సవం సందర్భంగా రైతు వేదిక పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఆర్.కిషోర్ నాయక్,ఏఈవోలు కే. రమేష్, ఎండి షఫీ,ఓటీఎం,బీటీఎం గిరీశం,కృషి సఖీలు సోమమ్మ,నాగమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/మోటకొండూర్ : విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ డిఆర్డిఏ గుర్రం సురేష్ అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూర్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన వి బి జీ రాంజీ (మహాత్మ గాంధి జాతీయ గ్రామీ ణ ఉపాధి హామీ పథకం)లో01/04/2025 నుండి 31/03/2025 జరిగిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 గ్రామ పంచాయతీ లలో కూలీల ఖర్చు 2,66,93,999 రూపాయలు కాగా, సామాగ్రి ఖర్చు వి బి జి రాంజీ లో 29,29,366 రూపాయలు, పంచాయతీ రాజ్ విభాగంలో 1,85,16,334 రూపాయలు మొత్తం 4,52,29,225 రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. విధులలో నిర్లక్ష్యం వహించిన ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు 10వేల రూపాయలు ఫైన్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలేన్స్ అధికారి ఆదిత్యవర్ధన్, యంపిడిఒ ఇందిర, యంపిఒ చంద్రశేఖర్, ఎఈపిఈర్ శ్రీనివాస్, ఈసి గోవర్ధన్, వివిద గ్రామాల సర్పంచ్లు భూమండ్ల జేయమ్మ శ్రీనివాస్, బెల్లి మహేష్, గోలను అంజయ్య, పసల ప్రదీప్, ఎస్ఆర్పిలు మహేశ్, అశోక్, డిఆర్పిలు, టిఏలు స్వామి, చంద్రమోహన్, మంగ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత తోనే మానసిక ప్రశాంతత



ప్రజాపక్షం/హాలియా: మనిషి జీవితం ఆధ్యాత్మికతతో ముడిపడి ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రనవానంద స్వామి ప్రభూజీ అన్నారు. హాలియాలోని శ్రీ సీతారామ సహిత స్వయంభు శ్రీ భక్తాంజనేయ ఆలయంలో ప్రనవానంద ప్రభూజీతో ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిని సన్మార్గంలో నడిపించే శక్తి ఒక్క దైవ శక్తి కే ఉందని దానిని అనుసరిస్తే మనిషి పరిపూర్ణంగా జీవించవచ్చని తెలిపారు. భగవద్గీత మనిషిని మంచి మార్గంలో నడిపించే శక్తిని ఇస్తుందని దానిని ఆచరించేలా మనిషి నడవడిక ఉండాలని సూచించారు. ఏది జరిగిన మన మంచికే జరుగుతుందని విషయం మనిషి గ్రహించాలని చెప్పారు. హనుమంతుని వ్యక్తిత్వం సమాజానికి మార్గదర్శకం అని దానిని ఆచరించేలా మనిషి తనను తాను రూపుదిద్దుకోవాలని తెలిపారు. అనంతరం ప్రనవానంద స్వామి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని సన్మానించారు. విద్యార్థులను నృత్యాలు, కోలాటాలు సమావేశానికి వచ్చిన భక్తులను అలరించాయి.

## కాంగ్రెస్‌పై తీన్మార్ మల్లన్న దుష్ప్రచారం తగదు



ప్రజాపక్షం/మోటకొండూర్ : కాంగ్రెస్ పార్టీ అండదండలతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తూ బీసీ రాజ్యాధికార పార్టీ పేరుతో బిసి బిడ్డ బీర్ల అయిలయ్య పై ఆలేరు అసెంబ్లీకి ఎమ్మెల్యే గా పోటీ చేస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, ఆలేరులో పోటీ చేస్తే డిపాజిట్ గల్లంతవుతుందని మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూర్ మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమండ్ల శ్రీనివాస్, టౌన్ ప్రెసిడెంట్ బుగ్గ కొమురయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీల ఐక్యత, రాజ్యాధికారం గురించి మాట్లాడే మల్లన్న తీరు ఆచరణలో భిన్నంగా ఉందని, బీసీలకు రాజ్యాధికారం రావాలని ఒకవైపు మాట్లాడుతూ మ రోవైపు బిసిలను అనుగదొక్కడం బాదకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కులు జూకంటి మధు,మాజీ ఉపసర్పంచ్ రేగు శ్రీనివాస్, సంగు శేఖర్,బుగ్గ సత్యనారాయణ, భూమండ్ల వెంకటేష్, రంజిత్ పాల్గొన్నారు.

## రాజశేఖర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ,మాజీ ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్ షాక్తో మరణించిన కేసాని రాజశేఖర్ రెడ్డి స్వగ్రామం గుట్టకింది అన్నారంలో శాసనమండలి సభ్యులు ఎంసీ కోటిరెడ్డి,రాష్ట్ర పార్టీ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి మంగళవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి అంత్యక్రియల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.మృతుని మూడేళ్ల కుమారుడిని,ఏడాది పాపను చూసి వారు చలించి పోయి భావోద్వేగానికి గురయ్యారు.మరణించిన రాజు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెరో నాలుగు లక్షల రూపాయల చొప్పున ఫిక్సడ్ డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను అందజేశారు.గూగుల్ పే,ఫోన్పే ద్వారా బిఆర్ఎస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధుల ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్ట మల్లికార్జునరెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,గోన రవీందర్ రావు,మాజీ ఎంపీపీ కరీం పాషా పాల్గొన్నారు.





## 27న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: టీజీఈ జేఏసీ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 27న నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పి,డీఎస్పిలకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాధర్నాకు ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీజీఈ జేఏసీ నాయకులు బి. యాదయ్య,నర్సింహాచారి,జే.శేఖర్ రెడ్డి, యాకూబ్ నాయక్,కోపు రాంబాబు,కృష్ణమూర్తి, సందీప్, రాజు, మనోజ్,ప్రదీప్,రణదేవ్,బైరబోయిన భిక్షం, సత్యనారాయణ,గోవర్ధన్ రెడ్డి,వెంకటపతి,రవినాయక్,జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల రైతులు తమ పంటలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూరజ్ మంగళవారం రైతులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతులు వారి భూములలో వర్షాకాల సీజన్కు సంబంధించిన ఏఏ పంటలను సాగు చేస్తున్నారో వాటిని తప్పని సరిగా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పంటలను సాగు చేస్తూ ఆన్లైన్లో రైతులు తమ పంట వివరాలను నమోదు చేసుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే, సన్నాలకు బోనస్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు వర్తించవని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారులు తమ గ్రామాలకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండి సాగు చేస్తున్న పంటల వివరాలను తెలియజేసి ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు



ప్రజాపక్షం/మర్రిగూడ: విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి,అభ్యసనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు దామెర భీమనపల్లి పాఠశాలలో ఏఐఎక్సెల్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం కంప్యూటర్ తరగతులు ప్రారంభించారు.మండల విద్యాధికారి శారద,ప్రధానోపాధ్యాయులు ఉదావత్ లచ్చిరాం ఈ తరగతులను లాంఛనంగా ప్రారంభించారు.ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో రాణించడానికి దోహదపడుతుందని,డిజిటల్ విద్య వల్ల వారిలో సృజనాత్మకత, ఆలోచనా నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాపక్షం/నందికొండ:స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లలిత తెలిపిన వివరాల ప్రకారం పీఈటీ రమేష్ శిక్షణలో తర్ఫీదు పొందిన పదో తరగతి విద్యార్థులు వెంకట సాయి, ముజీబ్లు తమ ప్రతిభతో జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్,షాట్ పుట్ విభాగాల్లో జిల్లా తరఫున ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జోస్పిన్,ప్రిన్సిపాల్ సిస్టర్ లలిత,ఉపాధ్యాయులు అభినందించి,పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.





## విద్యుత్ షాక్ తగిలి ఆవు మృతి

**ప్రజాపక్షం/చందంపేట;** చందంపేట మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు పాడి ఆవు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిందని రైతు పఠాన్ ఖాదర్ తెలిపారు. రోజు వారిగానే సోమవారం ఉదయం ఆవు మేత మేస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వ్యవసాయానికి జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. ప్రభుత్వం తరుపున సహాయం అందజేయాలని రైతు వేడుకున్నాడు. అనంతరం ఘటన స్థలానికి చేరుకున్న వెటర్నరీ వైద్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిశీలించి పంచనామ నిర్వహించారు.

## పేదలకు ఇందిరమ్మ ఇండ్లు




**ప్రజాపక్షం/హాలియా:**పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. హాలియా మున్సిపాలిటీలోని ఏడవ వార్డుకు చెందిన జూపల్లి రామలింగయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు పూర్తిచేసి సోమవారం గృహప్రవేశం చేశారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజల అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వారి చిరకాల వాంఛ తీర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.దీనిలో భాగంగానే మొదటి విడత మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తికావచ్చినట్లు తెలిపారు.

## కోతుల సమస్యకు తాత్కాలిక పరిష్కారం

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలో సంచరిస్తూ గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతులను సర్పంచ్ సందీప్ కుమార్ నిపుణులను పిలిపించి బోన్ల ద్వారా పట్టించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఆహారం కోసం తిరుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న కోతులను వన్యమృగ సంరక్షణ కేంద్రాలకు తరలించేందుకు ఈచర్య తీసుకున్నట్లు తెలిపారు.ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి పజ్జూరి శ్రీకాంత్,వార్డు మెంబర్లు మాతంగి సుధీర్,ఎస్‌కె హాజీ తదితరులు ఉన్నారు.



# విద్యుత్ సరఫరాతో ఫ్యాన్లు, లైట్లు దగ్ధం



**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి రోడ్డులో ఉన్న వడ్డెరగూడెంలో విద్యుత్ సరఫరా సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గూడెంలో సుమారు 30 నుంచి 40 కుటుంబాలు నివసిస్తున్నాయి.వారికి విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు 10 హెచ్‌పీ విద్యుత్ నియంత్రికను ఏర్పాటు చేశారు.అయితే విద్యుత్ నియంత్రిక ఏర్పాటు,నిర్వహణలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం,సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా తరచూ అధిక విద్యుత్ సరఫరా అవుతోందని గూడెం వాసులు ఆరోపిస్తున్నారు.అధిక వోల్టేజీ కారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, లైట్లు, ఇతర విద్యుత్ పరికరాలు దగ్ధమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా విద్యుత్ నియంత్రిక వద్ద సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేయకపోవడంతో నియంత్రిక స్తంభానికి సైతం విద్యుత్ సరఫరా అవుతోందని చెబుతున్నారు.దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నప్పటికీ సంబంధిత విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.విద్యుత్ నియంత్రికను,ఎర్తింగ్ వ్యవస్థను అధికారులు వెంటనే పరిశీలించి లోపాలను సరిచేయాలని కోరుతున్నారు.వడ్డెరగూడెంలో సరైన వోల్టేజీతో విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు,ప్రమాదాలకు అవకాశం లేకుండా నియంత్రిక వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని గూడెం వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామకంతం ఆక్రమణపై ఎంపిఒ విచారణ

**రీజనల్ రిజిస్టర్‌లో అక్రమ అనుమతులపై ఆరా**



**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని చిట్టంపహాడ్ గ్రామంలో గ్రామకంతం భూమి ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదులపై మండల పరిషత్ అధికారి సీహెచ్.మధు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.గ్రామకంతం భూమికి సంబంధించి పంచాయతీ రికార్డుల్లో, ముఖ్యంగా అసెస్మెంట్,రీజనల్ రిజిస్టర్ లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు ఆరా తీశారు.గ్రామానికి చెందిన పురాతన గ్రామ కంతం స్థలం కొంతమంది వ్యక్తుల ఆక్రమణకు గురైందని,అనంతరం పంచాయతీ రికార్డుల్లో పేర్ల మార్పులు చేసి అక్రమ నిర్మాణాలకు హక్కులు కల్పించేందుకు ప్రయత్నాలు జరిగాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ గ్రామ కంతం భూములు ప్రజా ఆస్తులని,వాటిని ఆక్రమించడం లేదా రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేయడం సహించేది లేదన్నారు.రికార్డుల పరిశీలనలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులైన అధికారులు,సిబ్బందితో పాటు ఆక్రమణదారులపైనా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆక్రమణలకు గురైన గ్రామకంతం భూములను పరిరక్షించడంతో పాటు అవసరమైన చోట రికార్డులను సరిచేస్తామని తెలిపారు.

**వీవో బిల్డింగ్ నిర్మాణంపైనా విచారణ**

గ్రామంలో వీవో బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపైనా ఎంపీఓ విచారణ చేపట్టారు.దీనిపై గ్రామ పంచాయతీ పాలకవర్గంతో సమావేశం నిర్వహించి,తీర్మానం చేసిన అనంతరం వీవో బిల్డింగ్ నిర్మాణ పనులు చేపడతామని ఎంపీఓకు సర్పంచ్ కోరే దేవేంద్ర సైదులు తెలిపారు.గ్రామకంతం విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరవాది యాదయ్య ,వార్డు సభ్యులు ఉగ్గపల్లి రాణి,గడ్డం మధు,బోయపల్లి యాదమ్మ,బుషిపాక లక్ష్మయ్య, బుషిపాక ఏడుకొండలు,గిరిస్వామి,బెల్లం వెంకటేశ్వర్లు,ముమ్మడి రవీందర్ రెడ్డి,ఉగ్గపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘం పాలక మండలి ఎన్నికలు పూర్తి

**పాలక మండలి సభ్యులుగా తొమ్మిది మంది విజయం**



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ చేనేత సహకార సంఘం ఎన్నికలు మంగళవారం స్థానిక కార్యాలయంలో పూర్తి పోలీస్ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిశాయి. తొమ్మిది మంది కార్యవర్గ సభ్యుల స్థానాల కోసం నామినేషన్ల ఘట్టం నుంచి పోలింగ్ వరకు రెండు ప్యానెళ్ల మధ్య హోరాహోరీగా ప్రచారం సాగింది. ఏడుగురు పురుషులు, ఇద్దరు మహిళా కార్యవర్గ సభ్యుల ఎన్నికకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పకడ్బందీ ఏర్పాట్లతో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 491 మంది ఓటర్లకు గాను 425 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి విజయం సాధించిన ప్రతినిధులను ఎన్నికల అధికారి ప్రకటించారు. గెలుపొందిన వారిలో గడ్డం రమణయ్య, రాపోలు కృష్ణమూర్తి, రాపోలు వెంకటేశ్వర్లు, రావిరాల నాగేందర్, ఆయిటి పాముల మురళీధర్, నామని సత్యం, గంజి శ్రీనివాస్, పులిపాటి రామేశ్వరి, గుంటి చంద్రకళ ఉన్నారు. విజేతలకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించి పట్టణంలో విజయ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిలుకూరి బాలకృష్ణ, రైస్ మిల్లర్స్ డైరెక్టర్ గుంటి గోపి, కృష్ణ ప్రసాద్, పాండు పాల్గొన్నారు.

## భోజన సామాగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/నందికొండ:** హిల్ కాలనీలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సోమవారం భోజన సామాగ్రిని పంపిణీ చేశారు.వసతి గృహ వార్డెన్ షేక్ మహమూద్ విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి భోజన సామాగ్రిని అందజేశారు.ఈసందర్భంగా వసతి గృహంలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఫహీమ, జ్యోతి విద్యార్థులకు సామగ్రిని అందించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగకరమైన సామగ్రిని అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



## బిసిల హక్కుల కోసం ఉద్యమించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీల హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ఉద్యమించాలని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కోరారు. మంగళవారం బిందేశ్వరి ప్రసాద్ మండల్ 109వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రబెల్లి దుర్గయ్య రజక, రేవంతు మహేష్, సంతోష్, నరేష్, చింటూ, అభిలాష్, సమీర్, సాత్విక్, అక్షయ, వైష్ణవి, నికిత, కార్తీక్ పాల్గొన్నారు.

**అసమాన త్యాగాలకు నిలువెత్తు రూపం**




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** బిసి రిజర్వేషన్ల కోసం ఈ దేశ బిసి పౌరుల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన అసమాన సాహసి బిందేశ్వరి ప్రసాద్ మండల్ అని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని శాంతిస్తూపం వద్ద బిందేశ్వరి ప్రసాద్ 107వ జయంతి కార్యక్రమాన్ని బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా నాయకులు జక్కుల రమేష్, బిసి హక్కుల సాధన సమితి నాయకులు చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** బిసిలకు 27శాతం రిజర్వేషన్ కావాలని బిందేశ్వరి ప్రసాద్ మండల్ చేసిన త్యాగం నిరూపమామనమైనదని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం నేరేడుచర్ల ప్రధాన కూడలిలలో బిపి మండల్ 107 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి సుందరయ్య, రాపోలు నవీన్, చిలకరాజు శ్రీను, కొమ్రరాజు వెంకట్, వాడాల భాస్కర్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిసి రిజర్వేషన్ల పితామహుడు బిపి మండల్ చేసిన పోరాటం వల్లే నేడు బిసిలకు ఉద్యోగ, విద్యారంగాల్లో అవకాశాలని బిసి హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు బూర వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బిపి మండల్ 108వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల ప్రతినిధులు బూర సైదులు, పెండ్ర కృష్ణ, ఎండి పాషా, కుక్కడపు శౌరి, రెడ్డిమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



# నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనమహోత్సవం కింద ఈరోజు ఒక్కరోజే జిల్లాలో 2 లక్షల మొక్కలు నాటే బృహత్తర మెగా ప్లాంటేషన్ పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు నిరంతరం నీరందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌డిఓ ప్రేమ్‌రాజ్, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యు నరసింహారావు, ఎస్‌సి సంక్షేమ అధికారి లత, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : రేపటి తరం సుభిక్షంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సింగారెడ్డి పాలెం గ్రామ పంచాయితీ కమ్యూనిటి హాల్ ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జానయ్య, గ్రామ సర్పంచ్ ఒగ్గు కిరణ్ కుమార్, ఎంపిఓ రాజేశ్వర్, ఏపిఓ రవి, ఇరిగేషన్ ఏఈ లింగయ్య, రాములు నాయక్, టిఏ ఏకస్వామి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : భవిష్యత్ తరాలకు పచ్చని,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు.మంగళవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన వన మహోత్సవ కార్యక్రమానికి మేయర్ పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రభుత్వ కార్యాలయాలు,విద్యాసంస్థలు,ఖాళీ ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి నగరంలో పచ్చదనాన్ని పెంచాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ మహమ్మద్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,కార్పొరేటర్‌లు శంకర్,పెరిక స్వాతి, నగరపాలక సంస్థ కమిషనర్ బి.వంశీకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ;** పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం దేవరకొండ ఖిల్లా వద్ద దేవరకొండ మున్సిపాలిటి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 50 మొక్కలను



నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సంజీవయ్య, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, పర్యావరణ పరిరక్షణ అధికారి శకృనాయక్, ఏఈ రాజు, అర్చన, రాకేష్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హాలియా:** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉందని ఇబ్రహీంపేట సర్పంచ్ ఎడవల్లి వంశీ కృష్ణా రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో గ్రామ యువతతో కలిసి మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పులి యాలాద్రి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎడవెల్లి నరేందర్ రెడ్డిపాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పచ్చదనం పెంపోందించి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గుగులోతు రవీందర్‌నాయక్, నన్నెపంగు శ్రీనివాస్, జ్యోతివాస, ఇంజమూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అనంతగిరి:** ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎపివో నూకబత్తిని వెంకన్న, సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కాకర్ల సౌమ్య, గుండ్లపల్లి వెంకన్న, కంటు వేణు, ఎం.గురవయ్య, చింత సునిత, రాజకుమారి, గోపి, సైదులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తిప్పర్తి** :మండలంలోని ఏ.దుప్పలపల్లి రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారివినోద్ కుమార్, ఏడీఏ, తిమండల వ్యవసాయ అధికారి సన్నీ రాజు తదితరులు కలిసి రైతు వేదిక ఆవరణంలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్,ఏఈవోలు రజిత, సంతోషి,గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నాంపల్లి** :పర్యావరణ పరిరక్షణ మరియు పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మండల పరిధిలోని వడ్డేపల్లి,చిట్టంపహడ్ గ్రామాలలో సర్పంచులు జంపాల లక్ష్మి సైదులు,కోరే దేవేంద్ర సైదులు ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచులు అమరవాది యాదయ్య,బుషిపాక యాదయ్య,పంచాయతీ కార్యదర్శులు శివకుమార్ పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని లెంకలపల్లి గ్రామంలోని బీసీ హౌసింగ్ ఏరియాలో మంగళవారం ఎంపీడీవో జిసి.మున్నయ్య,గ్రామ సర్పంచ్ అయితగోని పద్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేతరి శంకర్ ఏపీవో జయరాజు,పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్,టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏర్పుల యాదయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నడిగూడెం:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని పంచి ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంను మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో ఆంజనేయులు, ఈసి శ్రీనివాస్, సర్పంచులు దున్న శ్రీనివాస్, కేసగాని సరిత, దట్ల నాగేశ్వర రావు, చక్రాల ఉమా పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శులు మల్లారెడ్డి, ఎలక ఉమారాణి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునగాల:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోదాడ సిడిపివో కిరణ్మయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరాఖత్ గూడెం అంగన్‌వాడి2 సెంటర్‌లో వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, సుబ్రమణ్యం, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : పర్యావరణ పరిరక్షణతోపాటు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వన మహోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి, వైస్ చైర్మన్ షఫీఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు నాగుల వాసు, గండూరి రమేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని తాజ్పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : వాతావరణ సమతుల్యానికి పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో దోహదం చేస్తాయని మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్ ఎంపీడీవో విజయ మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి అన్నారు.పోచంపల్లి పట్టణంలో మున్సిపల్ పాలకవర్గం సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం సామూహిక వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరపల్లి రాధికా రమేష్, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం)** : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్,రాయిపల్లి, సర్వేపల్లి గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు నాయక్, ఆత్మకూర్ సర్పంచ్ బీసు ధనలక్ష్మి, రాయిపల్లి సర్పంచ్ అంజయ్య, సర్వేపల్లి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నకిరేకల్:** పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో గన్నోజు.బ్రహ్మచారి, ఏపీవో రమణయ్య,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మంగళవారం నకిరేకల్ మండలంలోని నెల్లిబండ,చందంపల్లి,మంగళపల్లి,గోరింకలపల్లి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆడెపు రాఘవులు, మాచర్ల చంద్రకళ పాల్గొన్నారు.



